## సింగిల్ పేజీ కథలు

# కష్టార్జితం

**"ఏంటి రామారావు గారూ! మళ్లీ లోన్‌కి దరఖాస్తు పెట్టారు. కిందటి నెలేగా పదివేలు లోన్ తీసుకున్నారు" అన్నాడు మేనేజర్ రామనాథం.**

''ఏం చేస్తానుసార్! మా బావగారికి హఠాత్తుగా కావలసివచ్చింది. అతను ఇల్లు కట్టుకుంటున్నాడు. ఓ యాభైవేలు తగ్గిందిట. అతనికి పి.ఎఫ్ లోన్ వచ్చేసరికి ఓ రెండుమూడు నెలలు పడుతుందిట. అందాకా సర్దమని చెప్తే కాదనలేకపోయాను. బంధువులన్నాక అవసరంలో ఆదుకోకపోతే మరెందుకుసార్?'' అన్నాడు రామారావు.

''అవుననుకోండి. కిందటి నెల లోన్ పెట్టేటప్పుడు మీ కజిన్‌కి ఏదో అవసరం వచ్చిందన్నారు. ఇలా అందరికీ ఇస్తూ పోతే మీకు అవసరమైనప్పుడు ఎలా? ఎవరైనా అప్పుడు సహాయం చేస్తారా? అందరి అవసరాలకి సహాయపడతారు. లోన్ తీసుకుని వడ్డీలు కట్టుకుని మరీ? కొంచెం వాళ్ళ అవసరాలు సరైనవి అవునో, కాదో కాస్త చూసుకుని ఇవ్వండి'' అన్నాడు రామనాథం.

''కిందటి నెల మా కజిన్ భార్య ఆపరేషన్‌కి డబ్బులు అర్జంట్‌గా అవసరమైతే ఇచ్చాను. అతనికి ఇంకెక్కడా అప్పుడు పుట్టలేదు పాపం. ఆపరేషన్ లేటైతే ప్రాణానికే ప్రమాదం. అందుకే లోన్ తీసుకుని ఇచ్చానతనికి'' అన్నాడు రామారావు.

''సరేలే. మీకెవరు చెప్పగలరు? మీ పరోపకార బుద్ధి తెలియనిదెవరికి? సరే ఈ లోన్ అప్లికేషన్ మీద రికమండేషన్ చేసాను. తీసుకెళ్ళి మేనేజర్‌కి ఇవ్వండి. లోన్ శాంక్షన్ చేస్తారు'' అన్నాడు రామనాథం.

రామనాథం అడిగినట్లే మేనేజర్ కూడా అడిగితే అతనికి మళ్లీ అవే జవాబులు చెప్పి లోన్ శాంక్షన్ చేయించుకొచ్చాడు.

రామారావు బ్యాంక్‌లో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. అతనికి బంధుప్రీతి ఎక్కువ. ఎవరికి ఏ ఆపద వచ్చినా సాయం చేస్తాడు. స్నేహితులకి కూడా అంతే. అయితే రామనాథం అతనికి మరీ మరీ చెప్పాడు. ఆర్థిక సహాయం చేసేటప్పుడు మాత్రం కాస్త ముందు వెనుకలు చూసుకోమని.

అతని మంచితనం అలుసుగా తీసుకుని, చీటికీ మాటికీ ఎవరో ఒకరు అలా తీసుకుంటూనే ఉంటారు. కొందరైతే మరి తిరిగి ఇవ్వరు సరికదా. మరి కనిపించరు కూడా. అయినా సరే రామారావు బుద్ధిలో మాత్రం మార్పేమీలేదు. అలాగే సొంత ఇల్లు కట్టుకోవడానికి, ఫ్లాట్ కొనడానికి 'కో ఆపరేటివ్ లోన్' పెట్టి డబ్బులు తెచ్చి ఉంచేసరికి, బాబాయ్ వరసైన దూరపు బంధువొ



కరు హార్ట్ ఎటాక్‌కి గురై హాస్పిటల్ పాలైతే ఆ డబ్బులు అందుకు వాడేసాడు. ఇలా ఎన్నో! అయినా ఎప్పుడూ నిరాశ, నిస్పృహలకు లోనుకాలేదు రామారావు. ఇంకొకర్ని ఆపదలో ఆదుకున్నానని సంతోషపడేవాడు. రామారావు భార్య కూడా అతనికి తగ్గ ఇల్లాలే.

ఆ ఉదయమే రామారావు చెల్లెలు, బావగారు వచ్చారు ఊరినించి. ఉదయమే అడిగితే వాళ్లకి ఓ యాభై వేలు సర్దుబాటు చేస్తానని ఒప్పుకున్నాడు అతను.

ఆ మధ్యాహ్నం లంచ్ అవర్లో ఇంటికి వెళ్ళి ఇచ్చాడు. అతని బావగారు చాలా సంతోషించి తన ధన్యవాదాలు తెలిపాడు.

''ఇల్లు సగంలో ఆగిపోతుందేమోనని బాధపడ్డాను. సమయానికి నువ్వివ్వక పోయుంటే అంతే మరి! నీమీదే ఆశపెట్టుకువచ్చాను. చాలా థాంక్స్! రెండు మూడునెలల్లో నా పి.ఎఫ్ లోన్ వస్తే తిరిగి ఇచ్చేస్తాను'' అన్నాడతను.

''ఫర్వాలేదు. తొందరేమీ లేదు. మీకు ఎప్పుడు వీలైతే అప్పుడే ఇవ్వండి'' అన్నాడు రామారావు.

రేపుదయమే ఊరికి వెళ్తానంటే ఆరోజు సాయంకాలం ఆఫీసయ్యాక రామారావు బజారుకెళ్ళి చెల్లెలికి, బావగారికి బట్టలు కొని తెచ్చి అప్పుడే ఇంటికి వచ్చాడు. శ్రీమతి బహుశా గుడికి వెళ్ళుంటుంది. ఇంట్లో అలికిడిలేదు. చెల్లెలు, బావగారు డాబామీద ఉన్నట్లున్నారు. మెట్లు ఎక్కబోతూ వాళ్లమాటల్లో తన ప్రస్తావన వచ్చేసరికి ఆగిపోయాడు.

''మీ అన్నయ్య ఇంత వేగంగా ఒక్క పూటలోనే ఎలా తెచ్చేడనుకున్నావు? నే చెప్పలా? రెండు చేతులా ఆర్జిస్తున్నాడు. కనుక ఉన్న ఫళాన తెచ్చాడు. పై రాబడి ఏమాత్రం లేకపోతే మనలాంటి వాళ్లందరికీ అడగినప్పుడల్లా సహాయం చేయగలడా? ఒక్కొక్కర్ని తిరిగి అడగడు కదా! ఎంతైనా తన డబ్బు కాదు కదా! కష్టార్జితం అయితే ఇలా తిరిగి వస్తుందో? రాదో తెలియకపోయినా ఇవ్వగలడా?'' అంటున్నాడు అతని బావగారు.

''లేదండి. మా అన్నయ్య అలాంటివాడు కాదు. నీతి నిజాయితీ గల ఆఫీసరండీ'' అందామె.

దానికి ఒప్పుకోలేదు అతను.

''నీకేం తెలియదు. మీ అన్నయ్య కాబట్టి నువ్వలాగే అనుకుంటావు. పిచ్చిదానా! మరోలాగైతే ఇంత అర్జంట్‌గా ఎలా తేగలిగాడు ఈ డబ్బుల్ని? ఎవ్వడూ అప్పు చేసి వడ్డీ కట్టుకుని మరీ తెచ్చి ఇవ్వరు కదా!'' అన్నాడు.

''అలాగే లోన్ పెట్టి తెచ్చి ఇచ్చానన్నాడు కదా!' అందామె.

''అలా చెప్పక మరింకెలాగ చెప్పగలడు? పై రాబడి అనెవరైనా చెప్పగలరా?'' అతని వాదం.

ఈ సంభాషణ వింటూ మ్రాన్పడిపోయాడు రామారావు. అతనిలాంటిది ఊహించలేదు. క్రిందికి దిగి వచ్చాడు.

ఈలోగా రామారావు భార్య గేటు తీసుకుని రావడంతో వాళ్ళు మాటలాపేరు.

రామారావు మదిలో విపరీతమైన అలజడి. తనేమో అప్పుచేసి ఇస్తే ఇదా దానికి ప్రతిఫలం. లోన్ రికవరీ వల్ల నెలనెలా జీతం తగ్గి తను ఇబ్బంది పడుతూ మరీ ఇతరులకు సహాయం చేస్తే వాళ్ళేమో ఇలా అనుకోవడం అతనికి బాధ కలిగించింది. తన కష్టార్జితం వాళ్లకి పై రాబడిలా కనబడ్డానికి కారణం తను వెనకా ముందు ఆలోచించకుండా ఈజీగా వాళ్లకి సహాయం చేయడమే!

ఆ రాత్రి భోజనాల వద్ద తన బావగారితో సరిగ్గా

మట్లాడలేకపోయాడు రామారావు. ఆ రాత్రి సరిగ్గా నిద్ర కూడా పట్టలేదు. తను విన్నమాటలే మనసులో పదేపదే మెదులుతున్నాయి. తను అందరికీ సహాయపడుతున్నాడని అనుకుంటు న్నాడు గానీ వాళ్ళల్లో ఇలాంటి తలంపు ఉంటుం దని కలలో కూడా ఊహించలేదతను. అపాత్రదా నంలాగే ఇలాంటి సహాయం పనికిరాదని తెలుసుకు న్నాడతను.

-డి.వి.డి. ప్రసాద్ (ఒరిస్సా)

# క్లోజ్‌ఫ్రెండ్

**పుట్టి బుద్ధెరిగాక ఇంత పెద్ద సమస్య ఎప్పుడూ ఎదురుకాలేదు విమలకి. పూలపడవలా సాగిపోతున్న తన సంసారం సుడిగుండంలో చిక్కుకున్న ట్టుంది ఆమెకి. కాలుగాలిన పిల్లిలా ఇల్లంతా తిరుగుతోంది. దేనిమీదా మనస్సు నిలవడంలేదు.**

ఆరోజు ఉదయం యధావిధిగా భర్త ఆఫీసుకీ, కొడుకు స్కూల్‌కీ వెళ్ళాక ఇంటిపనులు చేసుకుంటున్న ఆమెకి కొడుకు స్కూల్‌లో పనిచేసే ప్యూన్ రాక ఆశ్చర్యం కలిగించింది. ప్రిన్సిపాల్ ఇవ్వమన్నారని ఓ కవర్ ఆమె చేతిలో పెట్టి వెళ్ళిపోయాడతను. విప్పి చదివిన ఆమెకి తల తిరగినట్టయింది. ఆమె కొడుకు రవి వారం రోజు లుగా స్కూల్‌కి రావడం లేదనీ, మర్నాడు వచ్చి ప్రిన్సిపా ల్‌ని కలుసుకోమనీ దాని సారాంశం.

'మరి స్కూల్ టైంకి రెడీ అయి వారంరోజులుగా వీడు ఎక్కడికి వెళ్తు న్నట్టు?' అయోమయంగా ఉంది ఆమెకి. వెంటనే భర్త రామం ఆఫీసుకి ఫోన్ చేసి చెప్పింది. ఆఫీసులో ఇన్‌స్పె క్షన్ జరుగుతోందనీ, సాయంత్రం త్వరగా వస్తాను కంగారు పడొద్దనీ చెప్పా డతను.

సాయంత్రం మామూలుగానే స్కూల్ వదిలే టైంకి ఇంటికి వచ్చి బట్టలు మార్చుకుని ఆడుకునేందుకు వెళ్ళిపోయాడు రవి. రామం ఆఫీసు నుంచి వచ్చాక భార్యాభర్తలిద్దరూ ఆలో చిస్తూ కూర్చున్నారు చాలాసేపు. నాలుగో తరగతి వరకూ ఇంటి దగ్గరలోనే ఉన్న స్కూల్‌లో చదివాడు రవి. ఈ సంవత్స రమే ఐదో తరగతిలో దూరంగా ఉన్న మంచి స్కూల్‌లో చేర్చారు. మరి ఇంతలోనే ఏమయినట్టు? మనసు పరిపరివిధాల పోతోంది ఇద్దరికీ. 'తమ పెంప కంలో ఏం లోటు జరిగింది? డ్రగ్స్ ట్రాఫికింగ్‌లో చిన్నపిల్ల లను వాడుకుంటున్నారని పేపర్లో చదివారు. కొంపదీసి అలాంటి వాటిల్లో చిక్కుకోలేదు కదా వీడు?' గుండె గుభే లుమంది.

మర్నాడు స్కూల్‌కని బయలుదేరిన రవిని వాడికి తెలియకుండా వెంబడించాడు రామం. రవి బస్ దిగి ప్రక్కనే ఉన్న పార్క్‌లోకెళ్ళి అక్కడ పిల్లలు ఆడుకుం టుంటే చూస్తూ అక్కడే బెంచిమీద కూర్చున్నాడు. కొంత సేపు వాడిని గమనించాక దగ్గరికి వెళ్ళి "పద" అన్నాడు రామం. మాట్లాడకుండా తండ్రి వెనకాలే ఇంటికి వచ్చాడు రవి. వాడి ముఖంలో భయానికి బదులు ఒక విధమైన రిలీఫ్ చూసి ఆశ్చర్యపోయాడు రామం.

ఇంటికి వచ్చాక వాడిని ఎన్ని ప్రశ్నలు వేసినా మౌనమే సమాధానమైంది. సాయంత్రం వెళ్ళి ప్రిన్సిపా ల్‌ని కలుసుకున్నారు ఇద్దరూ. ఆయనకి నమస్కరించి కూర్చున్నారు.

వీళ్ళ ముఖాల్లో దైన్యం చూసి జాలేసింది ఆయనకి. ఆయన ముఖంలో చిరునవ్వు చూసి ధైర్యం వచ్చింది వీళ్ళకి. రవి స్కూల్‌కి రావడం లేదన్న విషయం వీళ్ళకి తెలి యదని తెలుసుకున్నారాయన.

నెల్లాళ్ళ క్రితం ప్రోగ్రెస్ రిపోర్ట్ ఇచ్చారనీ రవి ఒక సబ్జె



క్ట్‌లో ఫెయిల్ అయ్యాడనీ విని ఆశ్చర్యపోయారు విమలా, రామం. ఇచ్చినవారం రోజులదాకా రిపోర్ట్ మీద పేరెంట్స్ సంతకం చేయించి తీసుకురాలేదు రవి. తర్వాత రిపోర్ట్ పోయిందని చెప్పాడు. డూప్లికేట్ రిపోర్ట్ ఇచ్చారు. అది ఇచ్చిన వారం తర్వాత స్కూల్‌కి రావడం మానేశాడు. అదీ విషయం.

"మీది అన్యోన్య దాంపత్యమనుకుం టాను?" ఆయన మాట విని ఏంచెప్పాలో తెలియక మౌనంగా ఉండిపోయారు.

ఆయనే మళ్ళీ అన్నారు "తను ఒక సబ్జెక్ట్‌లో ఫెయిల్ అయిన విషయం మీకు బాధ కలిగిస్తుందనీ, ఏ ఒకరికి చెప్పినా ఇద్దరూ కలిసి తనని దండిస్తారనీ భయపడ్డాడు రవి. తన సమస్య ఎవరికీ చెప్పుకోలేక తన చిన్ని బుర్రకి తట్టినట్టు చేశాడు. పూర్ చైల్డ్"

ఆయన ఏం చెప్తారోనని ఆత్రంగా వింటున్నారు.

"నా స్వానుభవంతో మీకో సలహా ఇస్తాను. అది పాటిస్తే మీకు ఇంక ఇలాంటి సమస్యలు రావు"

"మీరిద్దరూ ఒకే బాట ఒకే మాటలా కాకుండా మీలో ఒకరో అది తల్లి అయితే మరీ మంచిది. మీ బాబుకి క్లోజ్ అవ్వాలి. వాడికి ఏ సమస్య, కష్టం వచ్చినా మీతో పంచుకో గలిగే విశ్వాసాన్నీ, దారి చూపించగలరనే ధైర్యాన్ని వాడిలో కలిగించగలగాలి. వాడి చిన్న మనసు విప్పి మీతో చెప్పు కునే అవకాశాన్ని కల్గించాలి. అలాంటి అవకాశాలు లేకనే ఈ మధ్య చాలా మంది చిన్నారులు చిన్నచిన్న కారణాల దగ్గర్నుంచి పరీక్ష ఫెయిలయిన కారణాలవరకూ కార ణంగా ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. తల్లిదండ్రు లలో ఏ ఒకరితోనైనా సాన్నిహిత్యం ఉన్న పిల్లలు అయితే అలాంటి చర్యకు పూనుకోరు.

ఇంకా మీరు అదృష్టవంతులనే అనుకో వాలి. పసివయసులోనే ఈ సమస్య వచ్చింది కనుక చక్కదిద్దుకోవడానికి అవ కాశం ఉంది. ఇదే టీనేజ్ పిల్లలయితే ఏమైనా చేస్తారు. అందుచేత ఇకపై మీ బాబుకి మీరు క్లోజ్‌ఫ్రెండ్‌లా మెలగాలి" విమలని చూస్తూ అన్నారాయన.

ఆయనకి నమస్కరించి సెలవు తీసు కుని తేలికైన మనస్సులతో ఇంటిదారి పట్టారా దంపతులు. అప్పటినుంచీ ఆయన సలహాని అక్షరాలా అమలులో పెట్టారు కూడా.

మూడు నెలల తరువాత స్కూల్‌నించి వచ్చిన రవి ప్రోగ్రెస్ రిపోర్ట్ తల్లి చేతికిచ్చి నాన్నగారి చేత సంతకం పెట్టించమ్మా అని చెప్పి ఆడుకునేందుకు వెళ్ళిపోయాడు నిశ్చింతగా.

కొడుకులో వచ్చిన మార్పునీ, గతంలోని చేదు అను భవాన్నీ తలచుకుంది విమల. తన సంసారం మళ్ళీ దారిలో పడడానికి కారణమైన ప్రిన్సిపాల్‌కి మనసులోనే కృతజ్ఞత తెలుపుకుంది.

రవికి కావలసిన ప్రతి చిన్న అవసరానికీ కొడుకుతో కలిసి భర్తకి టెండర్ పెట్టేదీ తనే. ఆ టెండర్‌ని భర్త రామంతో కలిసి రహస్యంగా మంజూరు చేయించేది తనే. పిల్లలకి జ్ఞానం వచ్చి జీవితంలో సెటిలయ్యేదాకా తనకీ డబుల్‌రోల్ తప్పదంటూ తృప్తిగా నవ్వుకుంది విమల.

-సత్య (హైదరాబాద్)